31న అభినందన సభ

కాచిగూడ: దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎ.బాలాజీ ఈనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాచిగూడలోని తుల్జాభవన్ ధర్మశాలలో సాయంత్రం 3గంటలకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.అంజనారెడ్డి తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

2 నుంచి మార్కండేయస్వామి మాస దీక్షలు ప్రారంభం

కాచిగూడ: శ్రీ మార్కండేయ స్వామి మాలాధారణ మాస దీక్షలు జనవరి 2వ తేదీన ప్రారంభమవుతాయని అంతర్జాతీయ శ్రీ మార్కండేయ స్వామి మాలాధారణ దీక్షా గురుస్వామి మార్గదర్శకులు చిలుక నర్సప్ప పద్మశాలి గురుస్వామి తెలిపారు. ఆదివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. మార్కండేయ స్వామి దీక్షలకు స్త్రీలు, పురుషులు వయస్సుతో నియమ బేధం లేదన్నారు. మండల, మాస, అర్ధ మండల, ఏకాదశ దీక్షలు ఉంటాయని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో 'ప్రతినోట అన్నమయ్య పాట'ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణా తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు తరగతులు ఉంటాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, నందిని, యామిని అన్నమయ్య కీర్తనల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. 15 ఏళ్ల పైబడిన వారికి శిక్షణ ఉంటుందన్నారు. జనవరి నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.83749 27736.

కాసుల అనసూయ వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

కాచిగూడ: సమాజ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి తమవంతు సహాయ, సహకారాలు అందించేందుకు కాసుల అనసూయ వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కాసుల మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఆయన ట్రస్ట్ కమిటీని ప్రకటించారు. ట్రస్టీలుగా కాసుల విజయభారతి, కాసుల వినోద్, కాసుల రమణ, కాసుల చందు, కాసుల సతీష్ కుమార్, నర్రా దేవేందర్, నర్రా సాయికిరణ్, నర్రా సాయికిషోర్, కాసుల శ్వేత, కాసుల స్రవంతి, కాసుల స్వాతి, కాసుల లక్ష్మీప్రియా, కాసుల వందన ఉన్నారని ఆయన తెలిపారు.

శీలం నాగేశ్వరరావుకు డాక్టరేట్

ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఓయూ పరిశోధక విద్యార్థి శీలం నాగేశ్వరరావు డాక్టరేట్ పట్టా పొందారు. 'సోషల్ సెక్యూరిటీ ఫర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ ఇన్ తెలంగాణ'అనే అంశంపై ఓయూ సీనియర్ ప్రొఫెసర్ కేవీ అచలపతి పర్యవేక్షణలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు.

నిత్యావసరాల పంపిణీ

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ హాజరై వృద్ధులకు బియ్యం, పప్పు, నూనె, చెక్కర తదితర వస్తువులను అందజేశారు. 2012వ సంవత్సరం నుంచి ప్రతి నెల వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు రాజ్‌గోపాల్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న చలో హైదరాబాద్

చిక్కడపల్లి: ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు అమలు చేసుకునే విధంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలి 3న వేయి గొంతులు, లక్ష డప్పులతో మహా ప్రదర్శన పేరుతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు మాదిగ, నియోజకవర్గం ఇన్‌చార్జి గండి కృష్ణ మాదిగలు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం అన్నానగర్ బస్తీలో ఎల్లయ్యమాదిగ ఆధ్వర్యంలో గాంధీనగ్‌ర డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా సురేష్ మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షుడిగా చిర్ర రవిమాదిగను నియమించారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నూతన కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్: విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్‌లోని గంగపుత్ర సంఘం భవనంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి బి.రాకేష్ ఆధ్వర్యంలో 7వ తెలంగాణ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీలను నిర్వహించారు. తైక్వాండో అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కరాటే ఆత్మస్థైర్యంతో పాటు ఏకాగ్రతను పెంపొందిస్తుందన్నారు. చిన్ననాటి నుంచే చిన్నారులు క్రీడలపై దృష్టిసారించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో రాకేష్, శ్రీధర్‌రెడ్డి, బల్వంత్, ఎయిర్‌టెల్ రాజు, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గురుస్వాములు, పడిపూజ నిర్వాహకులతో ఎమ్మెల్యే

ఓం శ్రీస్వామియే శరణం అయ్యప్ప

ముగిసిన అయ్యప్పస్వామి వార్షిక పడిపూజ

నల్లకుంట: భక్తుల అయ్యప్ప నామస్మరణలతో న్యూనల్లకుంట పుర వీధులు భక్తి పారవశ్యంతో పులకించిపోయాయి. న్యూ నల్లకుంట అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు తూములూరి శంకర రాం గురుస్వామి ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 25న ప్రారంభమైన అయ్యప్పస్వామి వార్షిక మండల పూజ, సహస్ర కలశాభిషేక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు చింతులపాటి కృష్ణ మోహన్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం 7గంటలకు సహస్ర కలశాభిషేకం, అయ్యప్పస్వామికి అభిషేకం, పూజ, వేద ఆశీర్వచన నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లకుంట అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు తూములూరి శంకర రాం గురుస్వామి దంపతులను శాలువాతో సన్మానించిన ఎమ్మెల్యే మాట్లాడారు. శంకర రాం గురుస్వామి ఆధ్వర్యంలో కఠోర దీక్షతో గత 43 ఏళ్లుగా అయ్యప్ప స్వామి మండల పడి పూజ నిర్వహిస్తుండటం ఆ హరిహర సుతుడు అయ్యప్పస్వామిపై ఉన్న భక్తికి నిదర్శనమన్నారు. అయ్యప్ప మాల ధారణతో మాలదారుల్లో భక్తి భావం పెంపొందడంతో పాటు క్రమ శిక్షణ అలవడుతుందని చెప్పారు. మధ్యాహ్నం సుమారు 1500 మంది అయ్యప్ప మాలధారులు, ఇతర భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శారదనగర్ కాలనీలో...

అంబర్‌పేట: అయ్యప్పస్వామి మహా పడిపూజ కనులపండువగా జరిగింది. ఆదివారం బాగ్‌అంబర్‌పేట శారదనగర్ కాలనీలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు, సెంట్రల్‌జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతిమణి కావ్యకిషన్‌రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృతలతో పాటు పలువురు బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి పడిపూజలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు



శంకర రాం గురుస్వామి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని ఘంటశాల క్రీడా మైదనాంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కృష్ణాయాదవ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్షను ప్రారంభించారు. గురుస్వామి మధుసూదన్ అయ్యప్పస్వామి పల్లకీ ఊరేగింపును నిర్వహించారు. రమేష్ బండారి భక్తిగీతాల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్‌గౌడ్, అమృత, రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మహా పడిపూజలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యేలు

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొఫెసర్ వెంకట్‌రాజయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నల్లగొండ, వరంగల్, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా స్కూటో జేఏసీ తరుపున ప్రొఫెసర్ వెంకట్‌రాజయ్యను ఎంపిక చేసినట్లు స్కూటో జేఏసీ ప్రతినిధులు జస్టిస్ చంద్ర కుమార్, ప్రొ. సింహాద్రీ, ప్రొ. మురళీమనోహర్, ప్రొ. కొండా నాగేశ్వర్‌రావు, రాజకీయ జేఏసీ కన్వీనర్ కోల జనార్దన్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్కూటో జేఏసీ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సేవ్ కాన్‌స్టిట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్ గవర్నమెంట్ ఎడ్యుకేషన్ నినాదంతో స్కూటో జేఏసీ ఆవిర్భవించిందని తెలిపారు. భవిష్యత్‌లో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి స్కూటో కృషి చేస్తోందన్నారు.

◆ అందులో భాగంగానే 4 దశాబ్దాలుగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రొ. వెంకట్‌రాజయ్యను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించడంతో పాటు మూడు జిల్లాల ఉపాధ్యాయులకు సుపరిచితమైన వ్యక్తి అని అన్నారు. అందుకే వెంకట్‌రాజయ్య అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ. నాగుల వేణుమాధవ్, డాక్టర్ జీవన్, ఉపాధ్యాయులు బి. మల్లయ్య, వై.సందీప్, జక్కుల కృష్ణయాదవ్, డి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



స్కూటో జేఏసీ ఆవిర్భావ సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకట్‌రాజయ్య

ఉద్యమకారులను వాడుకొని వదిలేసింది బీఆర్ఎస్సే..

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను.. పోటాడి జైళ్లకు వెళ్లిన ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులను వాడుకొని వదిలేసిందని అన్నారు. ఆదివారం జరిగిన ఉద్యమకారుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను అడుగడుగునా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పొద్దున లేస్తే అబద్ధాలతో రచ్చకెక్కుతున్న మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్, కార్‌రేస్, కాళేశ్వరం, అమరజ్యోతి, సచివాలయం నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై, కోల్ మాఫియా,కరెంట్ మాఫియా, బియ్యం మాఫియా, స్యాండ్, ల్యాండ్ మాఫియాలపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ జేఏసీ నేతలు పాలడుగు గండయ్యను జేఏసీ నగర ప్రధానకార్యదర్శిగా, ఎస్.రాజయ్యను నగర కార్యదర్శిగా, పి.యాదగిరిని నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ నియామకపు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, ఢోలక్ యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవే నా లక్ష్యం



చిక్కడపల్లి: క్రమశిక్షణ, దేశభక్తి, పట్టుదలతో దేశ సేవ చేయడమే తన లక్ష్యమని ఎన్‌సీసీ(నేవీ వింగ్)విద్యార్థిని శాల్మలి కడెం అన్నారు. ఉత్తమ కేడెట్‌గా ఎంపికై జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్–2025కు వెళ్లడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన తల్లిదండ్రులు అరుణ డీఆర్‌డీవో సైంటిస్ట్ కాగా తండ్రి ప్రభాకర్ సూక్ష్మటెక్నాలజీ మేనేజర్. వారి చిన్న కూతురు శాల్మలి డీఆర్డీఎల్ ల్యాబ్ క్వార్టర్ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ నారాయణ కళాశాల, బీటెక్ మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో థర్డ్ ఇయర్ చదువుతున్నారు. రైఫిల్ షూటింగ్, కూచిపూడి నాట్యంలోనూ శాల్మలి ప్రవీణురాలు. అనేక అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్‌లో కూడా అనేక అవార్డులు వచ్చాయి. న్యూఢిల్లీలో తనకు తన గురువులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి ఎదిగానని శాల్మలి ఆదివారం 'సాక్షి'కి తెలిపింది.

42శాతం బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధమే..

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు పంచాయతీరాజ్ సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచకపోతే ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం ఆదివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించాలన్నారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు.

◆ పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27శాతం నుంచి 56 శాతంకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, డాక్టర్ ఆర్.అరుణ్, గొరిగె మల్లేష్, వేముల రామకృష్ణ, గాలిపల్లి అంజి, అనంతయ్య, సతీష్, ఉదయ్, మట్ట జయంతి, రమాదేవి, కీర్తిలత, కరుణ, అరుణజ్యోతి, పృథ్వీగౌడ్, రాజేందర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

డా. జాన్‌బాబుకు స్వర్ణనంది పురస్కారం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ సామాజిక వేత్త సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ డాక్టర్ ఎం.జాన్‌బాబును స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, డాక్టర్ జాన్‌బాబుతో పాటు మూర్తి గురుస్వామి, నృత్య గురువు బిందు చంద్రమౌళిలను పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జ్ మధుసూదన్, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, గూడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఫాసిజాన్ని రూపుమాపాలి



సామాజిక వేత్త అభినవ్ సిన్హా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో ఫాసిజాన్ని రూపుమాపేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మించాలని ప్రముఖ సామాజిక వేత్త అభినవ్ సిన్హా పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రలో అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 21వ శతాబ్దంలో ఫాసిజం అనే అంశంపై 7వ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా కార్మికవర్గ విముక్తి కోసం పోరాడుతూ.... ప్రాణాలు అర్పించిన అరవింద్‌సింగ్, మీనాక్షీల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభినవ్ సిన్హా మాట్లాడుతూ... ఫాసిజానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన శ్రామికవర్గ వ్యూహాన్ని రూపొందించాలని అన్నారు. 20వ శతాబ్దంలో ఇట లీ, జర్మనీలలో ముందుకొచ్చిన ఫాసిజాన్ని 21వ శతాబ్దంలో కార్మికుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిందన్నారు. నిరంకుశ లక్షణాలు ఉన్నా ఈ ఫాసిజం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. భారతదేశంలోని మోదీ, అమిత్‌షాల పాలన నిస్సందేహంగా ఫాసిస్ట్ పాలనే అని విమర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. అవింద్ మోమొరియల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆర్.రఘు, కేవీ రామచంద్రారావు, శివానికౌల్, డాక్టర్ నిఖిల్, ప్రేమ్ ప్రకాష్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కాలర్ శ్రీజ, ఆనంద్‌సింగ్, టీ.జే జేమ్స్ తదితరులు ప్రాల్గొని ప్రసంగించారు.

నృత్య, సంగీతోత్సవం



సాక్షి,సిటీబ్యూరో: కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లో శ్రీ సురభి అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ వారు 10వ అంతర్జాతీయ నృత్య, సంగీతోత్సవం– 2024ను ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యువ కూచిపూడి కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం గ్రామం పాఠశాల, కళాశాలకు సంబంధించిన పూర్వ విద్యార్థుల 36వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు యూనివర్సిటీ వైస్ చైర్మన్ వెల్దండ నిత్యానందరావు, పాలెం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కె.బుడ్డయ్య, కార్యదర్శి డి.మోహన్‌బాబు, కోశాధికారి ఎ.లక్ష్మీకాంత్, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాలెం గ్రామం అత్యంత వెనకబడిన ప్రాంతమని, 1964లో అక్కడ ఎటువంటి పాఠశాల లేని సమయంలో సుబ్రహ్మణ్య శర్మ (సుబ్బయ్య) అనే మహోన్నతమైన వ్యక్తి తన సొంత ఖర్చులతో విద్యా సంస్థలను ఏర్పాటు చేశారన్నారు. తన సొంత భూమిలో పండిన పంటలతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. విద్యాసంస్థలతో పాటు ఆ గ్రామానికి టెలిఫోన్, పోస్టాఫీసు, 32 పడకల ఆసుపత్రిని సైతం నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రంగాచారి, హనుమంతరెడ్డి, బ్రహ్మానందం, మదన్‌మోహన్, డీఎస్పీ దేవేందర్, డాక్టర్ ఏ.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున్

కేలండర్ల ఆవిష్కరణ



విశ్వకర్మ సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్లు

అంబర్‌పేట: విశ్వకర్మ సంఘం అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 కేలండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆవిష్కరించారు. అంబర్‌పేట అలీకేఫ్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వెంకట్‌రెడ్డి, పులి జగన్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట: నల్లకుంట ఆర్యవైశ్య సంఘం 2025 కేలండర్ ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. దీనికి హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి అంజన్‌కుమార్‌గుప్తా, కోశాధికారి ఉప్పల శివకుమార్‌గుప్తా, సంఘం ప్రతినిధులు లింగా ప్రకాష్‌గుప్తా, యాదగిరి, జయరాములు గుప్తా, జైన్ శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సంఘం ప్రతినిధులు

సంక్షిప్త వార్తలు

వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో నిర్వహించిన వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి పైగా మున్నూరుకాపు వధూవరుల కుటుంబ సభ్యులు పరిచయ వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోట రఘునాథ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి పరిచయ వేదికను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకుని సరైన జీవిత భాగస్వామిని ఎంచుకోవాలన్నారు. నేటి కాలంలో కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివాహ పరిచయ వేదికల ద్వారా సులభంగా సంబంధాలను కుదుర్చుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పి.విష్ణువర్ధన్, మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గంప చంద్రమోహన్, దామేర జ్ఞానేశ్వర్‌రావు, మణికొండ వెంకటేశ్వర్‌రావు, లింగిశెట్టి హనుమంతరావు, గోపాల రాధకృష్ణ, ఆత్మకూరి ప్రీతి, పొన్న సునిత, కల్పన, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అవగాహన సదస్సుల్లో పాల్గొనాలి

ముషీరాబాద్: మర్వాడీ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకతలపై తల్లిదండ్రులకు ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజేంద్రసింగ్ జడేజా తెలిపారు. ఆదివారం ఆయన కాబ్, వేద ఎడ్యుకేషన్ సొసైటీల ఆధ్వర్యంలో డాక్టర్ హర్థిక్ దోషితో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం దృష్టిసారించినట్లు తెలిపారు. సికింద్రాబాద్‌లోని యాత్రి నివాస్‌లో బీటెక్, బీబీఎం తదితర కోర్సుల విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సుకు పలు విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

తైక్వాండోలో సూర్యప్రకాష్‌కు గోల్డ్‌మెడల్

కాచిగూడ: హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్‌లో నిర్వహించిన 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో సీనియర్స్ విభాగంలో కాచిగూడ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. కరాటేకు వయస్సుతో నిమిత్తం లేదన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్స్ బాలరాజు, రాకేష్, రాజు, అబ్దుల్ సత్తార్, గోపన్న తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సంప్రదాయ నృత్యాలను నేర్పించాలి

ప్రముఖ నృత్యగురువు ఆర్.ప్రసన్నరాణి

చిక్కడపల్లి: పిల్లలకు చదువుతో పాటు సంప్రదాయ నృత్యాలను నేర్పించాలని ప్రముఖ నృత్యగురువు ఆర్.ప్రసన్నరాణి సూచించారు. ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో 'త్యాగరాయ గానసభలో–2024 సంవత్సరానికి వీడ్కోలు నూతన సంవత్సరానికి స్వాగతం'పలుకుతూ నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు నాట్యాన్ని మరింతగా నేర్చుకునేలా చూడాలన్నారు. నృత్యగురువు స్వరాజలక్ష్మి పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో సినీ నటుడు శ్రీనివాసులు, ప్రముఖులు పండిట్ అంజిబాబు, పీఎస్‌మూర్తి, అప్పల అనిల్‌కుమార్, పీఎస్ఎస్ శ్రీనివాస్, నృత్యగురువులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు నిరోధించాలి

కాచిగూడ: నూతన సంవత్సర వేడుకల్లో యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వినియోగించకుండా నిరోధించాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పబ్‌లు, రిసార్ట్‌లలో అశ్లీలతకు తావు లేకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుశీల్‌కుమార్, ప్రియా, శ్రీనివాస్‌గుప్తా, సంజయ్‌కుమార్, రాఘవ, అభినయ్ తివారి, నరేష్, చోటు తదితరులు పాల్గొన్నారు.